నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
03.
22 మే 2024
పేజీలు 8

**తరుణ్**

కజకిస్థాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ యువ షట్లర్ తరుణ్ మన్నెపల్లి విజేతగా నిలిచాడు. కజకిస్థాన్‌లోని ఆస్తానాలో ఏప్రిల్ 6న జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో తరుణ్ ఎనిమిదో సీడ్ సూంగ్ జూ వెన్ (మలేషియా)పై విజయం సాధించాడు. దీంతో తన కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టైటిల్‌ను గెలుచుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయపై భారత్‌కే చెందిన ఇషారాణి బరుహపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సంజయ్ శ్రీవాస్తవ, మనీష జోడీ రన్నరప్‌గా నిలిచింది.

# గోపాలిల కుంధేయి ఏ రాష్ట్రానికి చెందిన బొమ్మలాట?

**గతవారం తరువాయి**

### గులాబో సితాబో

- ఇది ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో.. ముఖ్యంగా లక్నో నగర వీధుల్లో ప్రదర్శించే తొడుగు బొమ్మలాట క్రీ.శ. 17వ శతాబ్దంలో ఆవిర్భవించినట్లుగా చెప్పే ఈ గులాబో సితాబోలో రెండు బొమ్మలను చేతులకు తొడుక్కొని ప్రదర్శన ఇస్తారు. కథ గులాబో, సితాబో అనే సవతుల కొట్లాటకు సంబంధించింది. ఒక కళాకారుడు హాస్య ప్రధానమైన డైలాగులు చెబుతూ పాట పాడుతుంటే మరో కళాకారుడు బొమ్మలను ఆడిస్తూ ఉంటాడు. ఇంకో ఇద్దరు డోలు, తాళాలతో సంగీతాన్ని అందిస్తారు.

### తాళ్ల ఆధారంగా ఆడే బొమ్మలాటలు (Marionettes)

- తాళ్ల సాయంతో లేదా దారాల సాయంతో ఆడించే కీలుబొమ్మలను 'Marionettes' అంటారు. పండితుల అభిప్రాయం ప్రకారం కీలుబొమ్మల్లో ప్రాచీనమైనవి ఇవే. వీటిని తల, భుజాలు, నడుము దగ్గర వేలాడదీసిన తాళ్ల సాయంతో ఆడిస్తారు.
- ఈ రకం బొమ్మలకు కీళ్లతో కూడిన భాగాలుంటాయి. వీటికి తాళ్లు కట్టి ప్రదర్శనలు ఇస్తారు.
- సంస్కృతంలో తాడును సూత్రం అంటారు. క్రీ.పూ. 2వ శతాబ్దం నాటిదిగా భావిస్తున్న భరతుడి 'నాట్యశాస్త్రం'లో సూత్రధార అనే పద ప్రయోగం కనిపిస్తుంది.

### కఠ్‌పుత్లీ

- రాజస్థాన్‌కు చెందిన తాళ్ల ఆధారంగా ప్రదర్శించే బొమ్మలాట ఈ బొమ్మల మెడ, ముఖం, తల భాగాలను ఒకే కొయ్యకు చెక్కి రూపొందిస్తారు. వీటికి పొడవైన కళ్లు చిత్రిస్తారు. ముఖాలకు పసుపు, తెలుపు రంగును ఉపయోగిస్తారు. మొండెం, చేతులనేమో బట్టపీలికలను కూరి తయారుచేస్తారు. అందుకని చేతులకు కీళ్లు ఉండవు.



- కఠ్‌పుత్లీ బొమ్మలకు కాళ్లు ఉండవు. పొడవైన వస్త్రాన్ని మెడ నుంచి కింది భాగం వరకు కప్పి ఉంచుతారు. ఈ రకమైన అలంకారం మధ్యయుగాల రాజస్థాన్ వేషధారణను తలపిస్తుంది. షాజహాన్ కాలం నాటిదిగా చెప్పే అమర్ సింగ్ రాథోడ్ కథతో పాటు పిర్తీ ఔర్ షికారీ, రూతీ రాజ్‌కుమారి కథలను ప్రదర్శిస్తారు.
- కఠ్‌పుత్లీకి రాజస్థాన్ జానపద సంగీతం నేపథ్యంగా ఉంటుంది. కళాకారులు ప్రదర్శనలో బొమ్మల గొంతులా ఉండేందుకు 'బోలి' అనే ఈలను ఉపయోగించి మాట్లాడతారు. తెర వెనుక నిలుచున్న కళాకారులు, తమ చేతివేళ్లకు కట్టుకున్న నాలుగు తాళ్ల సాయంతో ఈ బొమ్మలను ఆడిస్తారు.

### గొంబె ఆట్ట

- కర్ణాటకకు చెందిన తాళ్లతో ఆడించే బొమ్మలాట (గొంబె= బొమ్మ, ఆట్ట=ఆట). ఈ ప్రదర్శనకు ఉపయోగించే బొమ్మలు, వాటి అలంకారం యక్షగాన కళను పోలి ఉంటాయి. ఈ బొమ్మలు భుజాలు, మోచేతులు, తొడలు, మోకాళ్లు, పాదాల దగ్గర కీళ్లను కలిగి ఉంటాయి. వీటిని ఐదు తాళ్ల ఆధారంగా ఆడిస్తారు. సందర్భం, అవసరాన్ని బట్టి బొమ్మలాట కళాకారులు ఒకరి నుంచి అంతకంటే ఎక్కువమంది ప్రదర్శనలో పాల్గొంటారు.
- ప్రసంగాలుగా పిలుచుకునే యక్షగాన నాటక సాహిత్యమే ఆట్టకు ఆధారం. నేపథ్య సంగీతం జానపద, శాస్త్రీయ బాణీలను మేళవించి సాగుతుంది. భారతీయ బొమ్మలాటల్లో గొంబె ఆట్ట బొమ్మలే ఎక్కువ తాళ్లను కలిగి ఉంటాయి. వీటి అలంకరణ ముఖ్యంగా రాక్షస పాత్రలకు సంబంధించింది ప్రేక్షకులను రంజింపజేస్తుంది.

### కళాసూత్రి బహులియే

- ఇది మహారాష్ట్రకు చెందిన తాళ్లతో ఆడించే బొమ్మలాట. కళ అంటే ఆడించడం, సూత్ర అంటే తాడు, బహులియే అంటే బొమ్మలు అని అర్థం.
- రాజస్థాన్, ఒడిశాల్లో లాగే కళాసూత్రి బొమ్మలకు కూడా కాళ్లు ఉండవు. అయితే భుజాల దగ్గర రెండు కీళ్లు మాత్రం ఉంటాయి. వీటిని వేలాడదీసేందుకు తల దగ్గర ఒకటి, రెండు భుజాల దగ్గర రెండు మొత్తం మూడు తాళ్లు కడతారు. స్థానిక జానపద బాణీలతో సాగే ఈ కళాసూత్రి బహులియే ప్రదర్శనకు సాహితీ ఆధారం రామాయణం.

### బొమ్మలాటం

- ఇది తమిళనాడుకు చెందిన జానపద కళారూపం. ఇందులో తంజావూరు, కుంభకోణం శైలులనే రెండు రకాలు ఉంటాయి. ఇది అలంకరణకు సంబంధించిన భేదం. ప్రదర్శన రెండింటిదీ ఒకేలా ఉంటుంది. తాళ్లతో ఆడించే అన్ని కళారూపాల్లో భారతదేశంలో అతిపెద్ద బొమ్మలు ఈ కళారూపానివే. ఇవి సుమారు నాలుగున్నర అడుగుల ఎత్తు వరకు ఉండి, 10 కిలోల వరకు బరువు ఉంటాయి. వీటికి వివిధ శరీర భాగాల దగ్గర కీళ్లు ఉంటాయి.
- ప్రదర్శనలో మాత్రం బొమ్మలాటం తాళ్లు, కడ్డీతో ఆడించే రెండు లక్షణాలను కలిగి ఉంటుంది. వీటిని కడ్డీ ఆధారంగా నిలబెట్టి, వివిధ భాగాలకు అనుసంధానం చేసిన తాళ్ల సాయంతో ఆడిస్తారు. ఈ తాళ్లు బొమ్మలాట కళాకారుడి తలకు పెట్టుకున్న ఇనుప చట్రానికి బిగించి ఉంటాయి. ఆటలో ఇతనికి ఇతర కళారూపాలు సాయం చేస్తాయి. ప్రదర్శన ఇతిహాస, పురాణ కథల ఆధారంగా సాగుతుంది. నేపథ్య సంగీతంగా కర్ణాటక సంగీతంతో పాటు స్థానిక జానపద బాణీలను ఉపయోగించుకుంటారు. కేరళలో తాళ్ల సాయంతో ఆడించే బొమ్మలాటను 'నూల్ పావకూత్తు' అంటారు.



## గోపాలిల కుంధేయి



- ఇది ఒడిశాకు చెందిన తాళ్ల ఆధారంగా ఆడించే బొమ్మలాట. గోపాలిల అంటే గోపాలకుడు, కుంధేయి అంటే బొమ్మ. ఈ బొమ్మలను తేలికపాటి కర్రతో తయారు చేస్తారు. వీటికి కాళ్లు ఉండవు. మెడ భాగం నుంచి బొమ్మ మొత్తాన్ని కప్పేస్తూ వస్త్రం ఉంటుంది. వీటికి మెడ, భుజాలు, మోచేతుల దగ్గర కీళ్లు ఉంటాయి. బొమ్మలను ఐదు నుంచి ఏడు తాళ్లతో వేలాడదీస్తారు.
- బొమ్మలు ఒడియా ఆలయ శిల్పాలను పోలి ఉంటాయి. ఈ కళకు ప్రధాన సాహితీ ఆధారాలు రామాయణం, భాగవతంలోని శ్రీకృష్ణుడి జీవిత ఘట్టాలు. పద్యగద్యాలతో, ఒడియా జానపద-శాస్త్రీయ సంగీత నేపథ్యంతో ప్రదర్శనలు సాగుతాయి. పశ్చిమబంగలో తాళ్ల సాయంతో ఆడించే బొమ్మలాటను 'తారేర్ పుతుల్' అంటారు.

### పుత్లా నాచ్

- పుత్లా అంటే బొమ్మ, నాచ్ అంటే నాట్యం. ఇది అస్సాం రాష్ట్ర బొమ్మలాట. దీని ఆధారంగానే ప్రముఖ వైష్ణవ భక్తి ఉద్యమకారుడు శంకరదేవ 'భావ్ నాట్'గా పిలిచే నాటకాన్ని తీర్చిదిద్దాడని అంటారు. ఈ నాటకాలను 'అంకీయ నాట్' అని పిలుస్తారు. ప్రస్తుతం ఈ కళ అస్సాం గ్రామసీమలకే పరిమితం.

### లాయితీబి జాగోయి

- ఇది మణిపూర్ రాష్ట్రానికి చెందిన తాడు సాయంతో ఆడించే బొమ్మలాట. కథ వైష్ణవ కథలకు సంబంధించి సాగుతుంది. వీటిలో రాధాకృష్ణుల ప్రేమతత్వానికి సంబంధించిన ఇతివృత్తం ప్రధానమైంది. మృదంగం, ఖోన్-పుంగ్ అనేవి సంగీత పరికరాలుగా ఉపయోగిస్తారు. ఈ కళ క్రీ.శ.19వ శతాబ్దంలో మహారాజా చంద్రకీర్తి సింగ్ పాలనలో ప్రాచుర్యంలోకి వచ్చిందని చెప్తారు.

### తోలుబొమ్మలాటలు (Shadow Puppets)

- తోలుబొమ్మలాటల ప్రదర్శనను 'ఛాయా నాటకం' అంటారు. దీన్ని తోలుతో చేసిన చదునైన బొమ్మలను కాంతి చొరబడగలిగే తెర మీద, బాగా వెలుగునిచ్చే దీపం నేపథ్యంలో ప్రదర్శిస్తారు. తెర ముందు కూర్చున్న ప్రేక్షకులు అసలైన బొమ్మలను కాకుండా తెర మీద ఏర్పడే వాటి నీడల కదలికను తిలకిస్తారు.
- బొమ్మల శరీర భాగాలు సన్నివేశానికి అనుగుణంగా కదిలించడానికి ఆయా భాగాల కీళ్ల దగ్గర కడ్డీలను అమరుస్తారు. తోలుబొమ్మలాటల ప్రస్తావన తమిళ కావ్యం 'శిలప్పాదికారం'లో తొలిసారిగా కనిపిస్తుంది.

## చండ్యాచ బహుల్యే



- చండ్యాచ బహుల్యే అంటే తోలుబొమ్మలు అని అర్థం. ఇది మహారాష్ట్ర జానపద కళ. రత్నగిరి జిల్లాలోని కూడల్ గ్రామంలో ఈ కళను ప్రదర్శించే కుటుంబం ఉంది.
- చండ్యాచ బహుల్యే ప్రదర్శన బొమ్మలను జింక చర్మాన్ని అతుకులు లేకుండా వివిధ ఆకారాల్లో కత్తిరిస్తారు. వీటికి రంగులను అద్దుతారు. ఇది కూడా రామాయణ నేపథ్యంగానే సాగుతుంది. నాలుగు వైపులా మూసి ఉన్న తెర లోపల ఒక కళాకారుడు తోలుబొమ్మల్ని ఆడిస్తూ ఉంటాడు. ఒక నూనె దీపం పై నుంచి వేలాడదీసి ఉంటుంది. వేదిక బయట కళాకారులు వివిధ వాద్యాలతో కూర్చుని ఉంటారు. వీళ్లు కథాగానం చేస్తుంటే తెర లోపలి వ్యక్తి బొమ్మల్ని ఆడిస్తూ ఉంటాడు.
- చండ్యాచ బహుల్యేలో వాడే సంగీత పరికరాల్లో 'వాత' అనే పరికరం ఆసక్తికరం. దీన్ని వాయించే వ్యక్తి తన ఒడిలో ఒక కంచుపళ్లేన్ని బోర్లించి పెట్టుకుంటాడు. దీనిమీద మైనపు చుక్క అతికించి ఉంటుంది. ఈ చుక్క మీద సన్నటి పుల్లను ఉంచి, దీన్ని తన మాపుడు వేలు, బొటన వేలితో మీటుతాడు. దీనినుంచి వచ్చే ధ్వని వీనుల విందుగా ఉంటుంది.

## తోల్ పావకూత్తు



- ఇది కేరళకు చెందిన బొమ్మలాట. తోల్ అంటే తోలు, పావ అంటే బొమ్మ, కూత్తు అంటే నాట్యం. కేరళలోని పాలక్కడ్ జిల్లాలో ఈ ఆట కళాకారులు ఉన్నారు. సాధారణంగా దీన్ని భగవతి (భద్రకాళి) ఆలయంలో ప్రదర్శిస్తారు.
- కేరళలో చాలా భద్రకాళి గుళ్ల ముందు ఈ కళ ప్రదర్శనకు 'కూత్తుమడమ్' అనే శాశ్వత వేదికలు ఏర్పాటు ఉంటుంది. ప్రదర్శన 7 నుంచి 21 రోజులు సాగుతుంది.
- ప్రదర్శన కంబన్ తమిళ రామాయణం ఆధారంగా సాగుతుంది. కథ పద్య గద్యాత్మకంగా ఉంటుంది. ఇందులో వాడే భాష తమిళ, మలయాళ మిశ్రమం.
- కేరళ తోలుబొమ్మలు పారదర్శకంగా ఉండవు. కాబట్టి బొమ్మలకు రంగులు అద్దినప్పటికీ నీడలు నలుపు-తెలుపు రంగుల్లో ఏర్పడతాయి. వీటి ఎత్తు రెండున్నర నుంచి మూడు అడుగులు ఉంటుంది. తెర 12 అడుగుల పొడవు, నాలుగున్నర అడుగుల వెడల్పుతో ఉంటుంది. తెరకు అనుకూలంగా వెనుక చమురు దీపాలను అమరుస్తారు.
- ప్రదర్శన జరిగే రోజు సూర్యాస్తమయం తర్వాత ప్రధాన కళాకారుడు గుడికి వెళ్లి, ఆటకు సంబంధించి ప్రధాన ప్రమిదను వెలిగిస్తాడు. ప్రదర్శన సమయంలో దీన్ని వేదిక మీదికి తెస్తాడు. ఆ తర్వాత మిగిలిన దీపాలను వెలిగిస్తాడు. దీపాలకు తెరకు మధ్యలో తోలుబొమ్మలను ఉంచి నాటకం ప్రదర్శిస్తారు.
- ప్రదర్శనలో మొదటగా తెరమీద వినాయకుడి బొమ్మను ఉంచి పూజిస్తారు. ఆ తర్వాత అసలు ఆట మొదలవుతుంది. నేపథ్య సంగీతం స్థానిక జానపద, కర్ణాటక శాస్త్రీయ బాణీల కలయిక. సాధారణంగా ఎకుప్పర (మృదంగం), ఇలతాళం (తాళాలు) వాయిద్యాలుగా ఉపకరిస్తాయి. ప్రత్యేక సందర్భాల్లో చండ, మద్దెల అనే మృదంగాలను కురుంకుళల్ అనే నాదస్వరం కూడా జత కలుస్తాయి.

## రావణ ఛాయ



- ఇది ఒడిశాకు చెందిన తోలుబొమ్మలాట. రావణుడి నీడ అని దీని అర్థం. రామాయణ కథకు సంబంధించిన ఈ కళ రావణుడి పేరుతో ప్రసిద్ధిచెందడం విశేషం. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఈ కళను తోలుబొమ్మలాట అంటే ఒడిశాలో మాత్రం 'రావణ ఛాయ' అనడం మరో విశేషం.
- ఈ పేరు ఎలా వచ్చిందంటే రాముడు దేవుడు. దేవతలు స్వయం ప్రకాశం. కాబట్టి వారి నీడ ఏర్పడదని నమ్ముతారు. అందుకే దీనికి రామాయణంలోని మరో ప్రధాన పాత్ర రావణుడి పేరుమీదుగా 'రావణఛాయ' అని పిలుస్తున్నారంటారు. ఒకవేళ రాముడి పరంగా చెబితే దీన్ని 'రామనాటకం' అంటారు.
- అయితే తెర మీద రాముడి బొమ్మ కూడా నీడతో ఏర్పడేదే. కాబట్టి ఈ వివరణ అంత సబబుగా అనిపించదు. దీనికి ఒకప్పుడు ఒడిశాలో ప్రబలంగా ఉన్న బౌద్ధ, జైన మతాల ప్రభావం (ఇవి రాముడి కంటే రావణుడి పాత్రకు ప్రాముఖ్యం ఇచ్చాయి), రాముడి బొమ్మతో పోలిస్తే రావణుడి బొమ్మ భారీగా ఉండటం కారణాలుగా చెబుతారు. ప్రదర్శనకు సాహితీ ఆధారం ఒడియా కవి బిశ్వనాథ కుంతియా రాసిన 'బిచిత్ర రామాయణ్'.

**సంకలనం**
**హర్షవర్ధన్ చింతలపల్లి**